

“మీ సిగరెట్లు త్రాగేతే, ఫ్రెండ్సుతో కలిసి పిక్చర్సు, కాఫీ హోటళ్ళు దర్శించాలంటే జేబీలో పైసా లుంటాయి గాని లేక లేక భార్య కోరిన కోరికను అదీ పండుగ సందర్భంలోనైనా తీర్చాలంటే మీకు కష్టంగానే కనబడుతుంది” అన్నది మేరీ వరా.

జాన్ డేవిడ్ ఎప్పుడూ ఆఫీసునుంచి ఇంటికి వచ్చే టప్పుడు పువ్వులు పట్టుకువచ్చేవాడు. ఆ వేళకు సతీమణి మేరీవరా గుమ్మంలోనుంచే చిరునగవుతో లోనికి ఆహ్వానించేది. డేవిడ్ నవ్వుతూ లోనికి ప్రవేశించి చేతిలోని పువ్వులను సతీమణి తలలో పెట్టేవాడు. ఆ పిమ్మట భర్తను కుర్చీలో కూర్చోపెట్టి దరిజేరి “టై” విప్పేది. కాఫీ పట్టుకొచ్చి కప్పును పెదాల దగ్గరవుంచి త్రాగమనేది. ఇట్లాగే రోజూ సాగిపోతూ వుండేది. ఈ రోజు కూడా అట్లాగే జరిగింది. కాని అందులో ఒక ప్రత్యేకత ప్రవేశించింది. ఆ ప్రత్యేకతలో ఒక నూతనత్వం వుంది. ఆ రోజు మురిపెంతో కాఫీ కప్పును పెదాల దగ్గర వుంచటమే గాక భర్తచే త్రాగించింది కూడాను. ఆ పని పూర్తి చేశాక లాలనగా భర్తగారి బూట్లను విప్పుతూ, “ఏమండీ! క్రిస్మసు వస్తున్నది కదా! ఇక ఆట్టే ఎక్కువ రోజులు కూడా లేవాయె. ఇవాళ తారీఖు ఇరవై. నాకు మంచి డిజైను గల జాస్మిన్ చీర కొనిపెట్టండి. మన పెళ్ళయ్యాక ప్రథమంగా వస్తున్న పండుగ యిదే కదా!” అని అడిగింది. జాన్ డేవిడ్ వూహించుకొన్నాడు. ఓహో అందుకే కాబోలు ఈనాటి ఆహ్వానంలో ఒక ప్రత్యేకత, ఆ ప్రత్యేకతలో ఒక నూతనత్వం ఏర్పడింది. ఇన్నాళ్ళూ లేని స్త్రీబాణం ఈనాడు ఎంత నేర్పుతో ప్రదర్శించింది అను కున్నాడు. ఈ స్త్రీలలో వున్న గుణాలు రెండే. ఒకటి లాలనగా మురిపెంతో మైమరపింపజేస్తూ అడగటం—వీలులేకుంటే ద్వితీయంగా అలకను ప్రయోగించటం. ఇది వారి నైజగుణం. సరే...పెళ్ళయి ఏడాది కావస్తుంది. ఇంతవరకూ భార్యామణిగారు ఏ కోరికా కోరలేదు; తను తీర్చింది లేదు. ఇన్నాళ్ళకు ఈ రోజు అడిగింది. అదీ పండుగ సరదాకై....తీర్చాలి. కాని అందుకు బడ్జెటు లోటాయె. వచ్చే జీతం ఇంటి బాడుగ పోనూ మిగత ఇంటి ఖర్చులకే సరిపోతూంది. అప్పటికీ దిగులు లేకుండా, అప్పులు లేకుండా గడుపు కొస్తున్నాడు సంసారం. కాని ప్రత్యేకంగా నలభై రూపాయల చీర కొనాలంటే—ప్రాణాలు పైపైనే ఎగిరిపోయాయి. పండక్కి యిద్దరికీ కలిపి పాతిక రూపాయల బట్టలు కొందామనుకుంటే—అదీ పాతిక రూపాయలు చేతిలో లేవాయె. మేనేజర్ని అడగాలి... అతను దయదలచి యివ్వాలి. ఇప్పుడు పెద్ద మొత్తమే నెత్తిన పడింది. ఆ కంపెనీలో ప్రతి నెలా 29 వ తారీఖున్నే జీతం యిస్తారు. పండుగలకని ప్రత్యేకత ఏమీ లేదు. ఏమిట్రా భగవాన్ అనుకుని తన ఆలోచనలకు కంటిన్యూయిటీ యిస్తుండగా...మేరీవరా దానికి బ్రేక్ వేసింది.

“ఏమండీ!” అని పలకరించింది.

“ఆ! ఇక్కడే వుంటున్నాను డియర్!”

“అది కాదండీ .....”

చటుక్కున అందుకుని “ఇంకేమిటండీ?”

“అబ్బ! వూరుకోండీ! మీ చిలిపి హాస్యాలు ఇంకా మానుకున్నారు కారు. వంశోద్ధారకుడు రానున్నాడు.”

“హల్లో డార్లింగ్!...ఇన్నాళ్ళు చెప్పవు కాదేం? అయితే నీకు క్రిస్మస్ పేరీ మూర్.. సేత చీర” అని అన్నాడు.

మేరీవరా బుంగమూతి పెట్టి అదో రీతిగా “అదేమిటండీ! జాస్మిన్ చీర కొనిపెట్టరూ?” అని ముద్దుగా అడిగింది.

వ్యవహారం చెడిపోతూందని చెంతజేరి... గిల్లి “అబ్బే, సరదాకి అన్నాను—వరా...ఎట్లాగైనా కొని పెడ్తాగా!” అన్నాడు.

* * *

ఉదయం భర్త ఆఫీసు కెళ్తుండగా భార్య మరలా హెచ్చరిక చేసింది చీర విషయం. “చూస్తాగా” అన్నాడు. “అబ్బే, చూడటమేమీ సాగదండీ తప్పక పట్టుకరావాలి. ఇంకో విషయం కూడా క్రిస్మస్ రోజు నా ఫ్రెండు మేరీ శోభకూ...సుశీలకూ డిన్నర్ యివ్వాలి. కావలిస్తే మీ మిత్రుల్ని యిద్దర్నో ఒక్కర్నో పిలవండి. పర్వాలేదు” అని అర్ధాంగి అధికారంతో చెప్పింది.


“చాలా—యింకేమైనా వుందా?” అని కోపంతో అడిగాడు.

“చూడండీ డియర్! మీ కోపాలు యిక్కడ ఎందుకూ పనికిరావు. అది ఆఫీసు బంట్రోతులపై ప్రయోగించాలి. శ్రీమతుల సరసన మీరు బంట్రోతుల్లా మెలగాలి. మా కా స్వాతంత్ర్యం వుంది. దాని కొరకై పార్లమెంట్లో యింకా చర్చ కొనసాగుతూ వుంది. ఇదిగో! ఈ కాగితంలోని సామానులన్నీ తీసుక రండి. కాస్త సరుకు మంచిది చూచి పట్టుకరండి” అని అంది.

జాన్ డేవిడ్ కాగితాన్ని అందుకుని పాంటు జేబులో పెట్టుకుని మెట్లుదిగి వీధిలోకి నడచాడు. అసలు భార్యల్ని అదుపులో వుంచుకోవాలి. చనువిస్తే నెత్తిన కూర్చుంటారు. అధికారం చలాయిస్తారు. కోరిందల్లా కావాలని వేధిస్తుంటారు. ఇక సంసారం కొంతంగా కొనసాగినట్లేను. స్వాతంత్ర్యం—స్వాతంత్ర్యమంటూ యిట్లాగ పురుషుల్ని పీడిస్తుంటారు. ప్రథమంలో ఉత్త చీరే ననుకొంటే, ఇప్పుడు మిత్రుల్ని డిన్నర్‌కు కూడా ఆహ్వానించాలట. కనీసం ఎనభై రూపాయలు లేందే “క్రిస్మస్” గడవదు. ఈ పండుగలు అంటూ ఉండకపోతే బాగుండేది. సంసారంలో లేనిపోని రభసలు లేకుండా పోతాయి. కాని తాను ఒక్కడు అనుకున్నంత మాత్రాన, ఆశించినంత మాత్రాన ఫలించే దేమీ లేదు. ఏలాగో ఓలాగ తెచ్చిపడేయకుంటే ఇక “క్రిస్మస్” హాయిగా జరిగినట్లేను. ప్రపంచమంతా పరవశంతో పరవళ్ళు పోతూ, పరమానంద మనుభవించుచు ప్రభు పుత్రుని పుట్టుకను ఆచరించే ఆ రోజు మా చిన్న యింట్లో కళావిహీనంగా, కాంతిహీనంగా కాంత దుఃఖంతో కూడుకొని ఉంటుంది. కాని కింకర్తవ్యం ఏమీ తోచటం లేదు. ఈ పళంగా ఈ రోడ్లో ఓ వంద రూపాయల కాగితం వచ్చి కాళ్ళదగ్గర పడ్తే ఎంత బాగుండేది. ఆశించినవాడి కా మాత్రం అదృష్టం లభ్యమైతే యిక కొరతగ్గ దంటూ ఏమీ వుండదు. కేవల మది భ్రమ, పిచ్చి వూహా...గాలి మేడలు...కాని యింకా నాలుగు రోజు లున్నై...మిత్రుల్ని అడగటం. అప్పు చేయటం అసలే మంచిది కాదు. అంతవరకూ ప్రయత్నిస్తాం....అని ఆలోచించుకుంటూ మిస్టర్ జాన్ డేవిడ్ ఆఫీసు చేరుకున్నాడు.

* * *

ఇట్లాగే ఇరవై యొక్కటి, ఇరవై రెండు గడచి ఇరవై మూడో రోజు ప్రథమ గంట కూడా ప్రారంభమైంది. ఈ రెన్నాళ్ళు మిస్టర్‌గారు సతమతంతో ఏ ఒక్క నిశ్చయానికి రాకుండా పోయాడు. ఏవేవో పిచ్చి పిచ్చిగా ఆలోచిస్తాడు. వదిలేకుండా పరుగు లెడుతాను.



ఉద్దేశం లేకుండా వూహించుకొంటాడు. కాని ఇవేవీ కార్యసాధనకు పనికిరాకుండా పోయింది. మేరీవరాలో కోప చిహ్నాలు, అలక ప్రారంభమయ్యే సూచనలు గోచరమయ్యాయి. అందుకే ఆ రాత్రి భర్తతో సరిగా పలక లేదు. ఉదాసీనంగా ఉండిపోయింది. ఆవేళ సాయంకాలం మామూలు పద్ధతిలో భర్తకు ఆహ్వాన మివ్వ లేదు. చురచుర లాడుతూ కాఫీ కప్పు చేతి కందివ్వక టేబుల్‌మీద పెట్టి వెళ్ళిపోయింది. ఆనంద నందనంగా వుంటున్న గృహం అశోకవనంలా తయారయ్యే

సూచన లున్నాయి. ఇక తన కా డబ్బు దొరకడం కలలో మాట...ఆ మేనేజరు పిలుపు పెట్టి జొంకాయి వెళ్ళిపోయాడు. ఇక మిత్రుల్ని అడుగుదా మనుకుంటే అప్పు వడాలి. అంత ఖర్మ ఏమొచ్చింది. తిరిగి తీర్చేంతవరకు అదోవంక పీడిస్తూనే వుంటుంది. మేరీవర కాస్త కొట్టుసరిగానే ప్రవర్తించింది. ఖర్మై మూడవ ఉదయమున మిస్టర్‌గారితో తగువులు పెట్టుకొన్నది. ఇంతవరకూ భార్యాభర్తల మధ్య తగువులు జరిగియుండలేదు. మేరీవరకు తగువులు ఎట్లా ప్రారంభించాలో అర్థం కాలేదు. తాను చదువుకున్న చదువంతా వ్యర్థమనిపించింది. ఎట్లాగైతేనేం ప్రారంభించింది.

"మీ సిగరెట్లకైతే...ఫ్రెండ్సుతో కలిసి పిక్చర్లు, కాఫీ హోటళ్ళు దర్శించాలంటే జేబులో పైసా లుంటాయి గాని తన తన భార్య కోరిన కోరికను అది పండుగ సందర్భంలో తీర్చాలంటే మీకు కష్టంగానే కనపడుతుంది."

జాన్ డేవిడ్ తానెంత మెల్లగా శాంతంగా మాటాడితే అంత మంచి దనుకొన్నాడు. లేకుంటే వ్యవహారం ఇం బిగుసుకుంటుందని తెలుసు. మెల్లిగా "అది కాదు వరా! నువ్వు చూస్తూనే వున్నావు కదా! జీతమంతా నీ దగ్గరకే కదా తెచ్చియిస్తున్నా, నువ్వేకదా.. అన్నిటికీ ఖర్చులు పెడుతున్నావు...అన్నీ తెలిసి కూడ పైగా నున్న ఖరీదుగల బట్టలు కొనమంటే సాధ్యమయ్యేదేనా చెప్పు? ఆలోచించు" అని అన్నాడు.

"ఆ, ఎన్నైనా అంటారు..మీ ఫ్రెండ్సుకు అప్పుడప్పుడు చేబదుళ్ళుగా యిస్తుంటారే అవి తీసుక రండి సరిపోతాయి..." అని అంది.

"ఏ ఐదో, పదో, పదిహేనో! ఎక్కడకి చాల్తాయి. అవి తీసుకుని ఏమిటే ప్రయోజనం—నిన్ను బ్రతిమాలుకుంటా డియర్! ఈ క్రిస్మస్ శాంతంగా వెళ్ళిపోనీ...ఉన్న దాంతోనే పండగ జరుపుకుంటాం. ఉన్న బట్టల్తోనే చర్చికి వెళ్దాం—ఏం?" అని బ్రతిమాలుతూ లాలనగా అడిగాడు.


"ఎంత కమ్మగా వున్నాయండీ మీ మోసపు మాటలు—ఇదిగో మిస్టర్! ఆ ఆట లేమీ సాగవు.. సంసార జీవితంలో ప్రథమంగా వస్తున్న ఈ క్రిస్మస్‌ను శోకమయంగా చేసుకుంటే మిగతావన్నీ, అట్లాగే తగలడ్తాయి. కనుక తప్పనిసరిగా నా కోరిక యీడేర్చవలసిందే. లేదా రేపు సాయంకాలం మెయిలుకు మా యింటికి వెళ్ళిపోతా, అట్లాగని విన్నవే ఉత్తరం కూడా వ్రాసి పడేశాను. అవతల శ్రీవారి యిష్టం" అని తెల్లగా చెప్పేసింది. అది సూటిగా హృదయానికి తగిలింది మిస్టర్‌కు. ఎంత మాటందని అనుకున్నాడు. ఇక తన కెట్లాగూ డబ్బు దొరకదు. శ్రీమతి యిక పుట్టింటికి వెళ్ళిపోవలసిందే తనూ వెళ్తేసరి.. ఛీ! కలుగు లేకుండా అత్తవారింటికి వెళ్ళడం సమంజసం కాదను కున్నాడు. వెళ్ళనీ! వెళ్ళి వాళ్ళ వాండ్లతోనే ఆనందం అనుభవించనీ—తాను తనింటికి అన్నయ్య దగ్గరకు వెళ్దా మనుకున్నాడు. కాని ఆ సంవత్సరంలో యిట్లా తామిద్దరూ వాళ్ళ వాళ్ళ పుట్టింటికి వెళ్తే ఏం



"ఆఁ! మీరా" అన్నది మేరీవరా

బావుంటుంది. ఇరు కుటుంబాలూ ఏమౌతావా లేదేనని తప్పక అనుకుంటారు. అప్పుడు ఏమని సమాధానం చెప్పుకోవాలి. సలహాదారూ నవ్వుకోరూ. అది క్రిస్మస్ రోజు. కాని ఏదో ఒక్కటి కాకుండా మానదు. ఆ జగద్రక్షకుడే ఈ ప్రాబ్లమ్‌ను సాల్వుచేసి పెట్టాలని అనుకున్నాడు.

ఆ రోజు మధ్యాహ్నం అన్నం సరిగా వండలేదు. రుచి అంతకంటే లేదు. ఉప్పు అసలు లేనే లేదు. వడ్డన సక్రమ పద్ధతిలో లేదు. మారు మాట్లాడక ముగించాడు మిస్టర్!—మేరీవర అడిగినదానికల్లా ముభావంగా ప్రవర్తిస్తూ—గడిపింది. జాన్ డేవిడ్ కూడా మౌనంగానే నడుచుకొన్నాడు. ఎడా పెడాగా పెదమొఖం పెట్టి దంపతులు ఉండేవారు...మేరీవర ఏంటో గొణుగుతూనే వుండేది. ఆ సణుగుడు ఉండి ఉండి ప్రారంభించింది. డేవిడ్‌గారు దాన్నేమీ లెక్క చేయ లేదు. ఆ సాయంకాలం పరిస్థితి యింకా విషమించింది. అతను ఆఫీసునుంచి ఇంటికి రాగానే గుమ్మంలో ఎవరూ లేరు. తలుపు దగ్గరవేసి వుంది. తలుపు త్రోసుకుని ఇంట్లోకి ప్రవేశించి చూస్తే ఎవరూ లేరు. వంటింటి గదిలోని కెళ్ళి చూచాడు. మధ్యాహ్నం తిన్న గిన్నెలు ఎక్కడివక్కడే పడున్నాయి. వాటిని కడగనైనా లేదు. బోధపడింది. శ్రీమతిగారు ఉగ్రరూపం దాల్చియున్నారని. వంటయినా కూడా ఈ పూట మొదలెట్టలేదు. నేరుగా పడక గదిలోని కెళ్ళాడు. మేరీవర ముసుగుతన్ని పడుకుని వుంది. లేపుదా మనుకున్నాడు. అభిమానం అడ్డు వచ్చింది. ఎంతసేపు వుంటుందో వుండనీ తనకూ ఆకలి వేయాలి. మలమల మాడి చావాలి. అప్పటికైనా బుద్ధి రాక మానదు. ఎలాగూ హోటలుకెళ్ళి భోజనం తిని రావచ్చు. ఈ పూట కట్లాగే కానీ, కానీ అను కున్నాడు మిస్టర్‌గారు. హాల్లో కెళ్ళి సేమనకుర్చీలో కూర్చున్నాడు. సాయంకాలం కాఫీ కూడా పుచ్చుకో



ఫోటో: శ్రీ జి. ఆర్. కె. మూర్తి

లేదు. ఇంటివద్దనే త్రాగడం అలవాటు గనుక దారిలో పుచ్చుకోకుండానే వచ్చేశాడు. ఆకలివేయ నారంభించింది. ఓపిక పట్టాడు. పత్రిక తీసుకుని చదువ నారంభించాడు. గంట ఏడు కొట్టింది. కడుపులో ఆకలి బాధ విపరీతమైంది. తాళజాలకపోతున్నాడు. ఇంకా అర్ధగంటసేపు వుందావని ఎంత ప్రయత్నించినా వ్యర్థమవుతూ వుంది. అస లిన్నాళ్ళు ఆకలి బాధ నను భవించి ఎరుగడు. సరే హోటలు కెళ్ళాలని పైకి లేచాడు. పాంటు జేబులో చెయ్యి పెట్టాడు. బయటికి తీసి చూస్తే రెండు అణా బిళ్ళ లున్నాయి. తనలో నవ్వుకున్నాడు. భోజనానికి యింకా అర్ధ రూపాయ కావాలి. శ్రీమతిగారే క్యాషియర్. ఆమెనే అడిగి పుచ్చుకోవాలి. ఇప్పు డిహ ఎట్లా అని ఆలోచించాడు. తర్వాత పడక గదివైపు వెళ్ళాడు.

మేరీవర ముసుగు తీసేసి ప్రక్కగా పడుకుని వుంది. తాళంచెవి గుత్తి నడుములో చీర భాగానికి తగిలించుకొని వుంది. మిస్టర్‌గారు చప్పుడు చేయక ఆ గుత్తిని యుక్తిగా ఉపక్రమించాడు. మెల్లగ వేలిని అక్కడికి పోనిచ్చాడు. బీగాల్ని తాకినాడు. ఉన్నట్టుండి మేరీవర చేయి కూడ అక్కడకు వచ్చి భర్త చేతిని పట్టుకుంది. దొంగ చిక్కాడు కదరా నని అనుకున్నాడు. తన చేతిని శ్రీమతి చేతులో అట్లాగే వుంచేశాడు. కొన్సేపటికి మెల్లగ తీయా లనుకుని లాగినాడు. ప్రయోజనం లేదు. మేరీవర కెవ్వున కేకవేసి "దొంగ! దొంగ!" అని అరచింది. పైకి లేచింది. డేవిడ్ హృదయం జోరుగా! కొట్టుకొంటున్నది. "నేనే వరా మై డియర్! ఒరవకు" అని అన్నాడు గుండె దిట్టపరచుకుని "ఆ! మీరా!" అని అంటూ మంచం దిగి స్విచ్ ఆన్‌చేసి పక్కున నవ్వి "మీరేనా డియర్! బీగాల గుత్తికై దొంగతనం చేయడం" అంటూ "మీ శ్రీమతి వుండగ హోటలు భోజనం తినవలసిన ఖర్మ మీ కేం కల్గింది డియర్! ఇప్పుడే క్షణంలో అన్నం వండేస్తా. మధ్యాహ్నం కూరలే వున్నాయి చాల్లెండి..ఏదీ గవ్‌చివ్‌ని పావుగంట ఈ మంచంమీద కూర్చోండి" అని చెప్తూ భర్తను తీసుకెళ్ళి మంచంపై కూర్చోబెట్టి "ఇంకెప్పుడూ అట్లాంటి పనులు చేయకండి" అని అంటు మెల్లగ వంట గదిలోకి తుర్రుమంది. డేవిడ్‌కిది నటనా లేక ప్రవర్తనా అన్నది గ్రాహ్యం కాలేదు. ఏమైతేనేం భార్య అలక తిరోహితమైంది. ఇంక పర్వాలేదు. ఎట్లాగో అట్లాగ క్రిస్మస్ గడిపేయవచ్చు. బాధ పడవలసిన అవసరం లేదనుకుని దిండు కానుకున్నాడు.

ఆ రాత్రి అట్లే గడిచిపోయింది. ఇరువై నాల్గవ దినం అవతరించింది.

* * *

ఆవేళ కూడా ఆఫీసులో పర్కువుంది గనుక డేవిడ్ బయల్దేరుతున్నాడు. ఉన్నట్టుండి మేరీవర పాట ప్రారంభించింది. 'ఏమండో! జ్ఞాపకముంది కదూ రేపు క్రిస్మసని...చీర తీసుకరావాలనీ—ఫ్రెండ్సును డిన్నర్‌కు ఆహ్వానించాలని—మరచిపోకండేం—ఆఫీసు బంట్రోతుచేత త్వరగా సామానులు తీసిపంపండి...తెలుసుగా లేకుంటే సాయంకాలం బొంబాయి మెయిల్‌కు వెళ్తానని" అని హెచ్చరించింది. డేవిడ్ నిలువునా షట్ స్టాప్ అయ్యాడు. శ్రీమతి మారిం దనుకుంటే ఉదయం తిరిగి పాట ప్రారంభమైందే. ఏమీ పాలు పోలేదు. జరుగనున్నది జరుగ నిమ్మని బయల్దేరాడు. ఏవేవో ఆలోచించుకుంటూ ఆఫీసు చేరుకున్నాడు. చేరుకున్నాడే గాని మనసు మనసులో లేదు. శ్రీమతి వాక్కులమీదనే ధ్యానంనిమగ్నమైంది. ప్రపంచ జగద్విఖ్యాతమైన ఈ క్రిస్మస్ పండుగకు నా యిల్లు కళావిహీనంగా వుంటుందేమోనని భావించుకున్నాడు. ఏం పండగ—అని నిందించుకొన్నాడు—ఇంతలో పోస్టుమన్ వచ్చి మనియార్డర్ ఫారం చేతి కందిచ్చాడు. అతనికి సంతోషమైంది. ఎవరు పంపేరాని ఆశ్చర్యపోయాడు. అది వంద రూపాయలకు మనియార్డర్ చేయబడి వుంది. సెండర్ ఎడ్రస్ చూశాడు. అరె దీని తస్సదియ్యా! దీనిసంగతి మరచేపోయాను. సెకండు ప్రైజుకొట్టిందా..నష్టప్రైజువచ్చివుంటేనేం మానవుని ఆశకు అంతు లేదనుకుంటూ—తన నమ్మ్య లీది పోయిం దనుకుంటూ సంతోషంతో చేవ్రాలుచేసి డబ్బులు పుచ్చుకుని రూపాయి కాగితం పోస్టుమాన్‌కిచ్చాడు.వాడు సంబరపడి వెళ్ళిపోయాడు. సమయంలో ఆదుకొన్నందుకు సెకండు ప్రైజు కొట్టినందుకూ ఆర్. ఎం. డి. సి. కి వందనాలు సమర్పించుకొన్నాడు. అతని ముఖం ఆనందంతో విప్పారింది. అర్ధరోజు ఆసిస్టెంటు మేనేజర్ని అడిగి సెలవు తీసికొని కాఫీ హోటలు దర్శించి బజారులో కెళ్ళి ఏభై రెండు రూపాయల నాల్గణాలు పెట్టి చీరకొన్నాడు. మిగతా సామానులన్నీ ఏదీ మరచిపోకుండా శ్రీమతి యిచ్చిన కాగితం ప్రకారం మరువకుండా తీసుకున్నాడు. ఆ కాగితం ఆ పాంటు జేబులోనే భద్రంగా వుంది కూడాను. అన్నిటినీ ఆటో రిక్షాలో వేసుకుని యింటి దారి పట్టాడు. అపుడు జేబిలో చెయ్యిపెట్టి చూసుకుంటే రెండు రూపాయల ఎనిమి దణాల కాసే మాత్రం మిగిలివుంది. "హరి భగవంతుడా" అనుకున్నాడు. రిష్టువాచివైపు చూసుకున్నాడు. గంట మూడున్నర అయింది. ఆటో రిక్షా యింటిముందు ఆగింది. సామాన్లన్నీ దింపుకుని, డబ్బు లిచ్చి ఆటో రిక్షాని పంపేశాడు. తలుపు వేయబడివుంది. మెట్లెక్కి

తలుపు తట్టాడు. జవాబు లేదు. "మేరీ" అన్నాడు "——" మరలా "వెరా" అన్నాడు "—" ఈసారి గట్టిగా "మేరీవరా" అని అన్నాడు. "అబ్బ! వస్తున్నా నుండండీ. ఒక్కటే గోల. వీధిలో పొయ్యేవాళ్ళు ఏ మనుకుంటారు" అని రుసరుస లాడ్తూ తలుపుతీసి ఆశ్చర్యపోయింది. పొంగిపోయింది. "వెరీగుడ్"! అయితే అన్నీ తెచ్చినట్లేనా...థాంక్సు డియర్...చీర ఏదీ... లోపలికి రండి" అని అనురాగంతో అంది. ఆ తర్వాత సతీపతులు కలిసి సామానులు యింట్లోకి తీసుక పోయారు. తాపీగా కుర్చీలో కూర్చున్నాడు డేవిడ్. మేరీ వర సామాన్లన్నీ చూస్తూ వుంది. చీరవున్న పార్సెల్ తీసుకుని "ఇదిగో డియర్! నువ్వు కోరిన చీర తీసుక వచ్చాను. కట్టుకొని రేపు చర్చికి వెళ్ళు" అని అంటూ దాన్ని ఆమె కందించాడు. ఆమె తీసుకుని విప్పి చూచుకొని సంబరపడింది. ఆనందించింది. వెంటనే "అయితే మీకో...నాకు మాత్రం తెచ్చారే" అని అడిగింది. "నే నేమీ నీలా అలిగి బట్ట కావాలని కూర్చో లేదు. నా కేమీ అక్కర్లేదు. చక్కగా ముస్తాబై చర్చికి వెళ్ళిరా" అని కోపంతో అన్నాడు. శ్రీమతికూడ కోపం ప్రకటించి "అయితే నే నొక్కదాన్నే చర్చికి వెళ్ళడానికి చీర తెమ్మన్నానా. మీరు లేందే నాకు మాత్రం ఏ మానందం వుంటుంది. అందులోను చీర పట్టుకొచ్చారు గాని జాకెట్టు ఏదీ....తీసుకెళ్ళండి చీర నా కేమీ వద్దు" అని అంటూ మూతి అదోలా పెట్టి అటువైపు తిరిగింది.

"ఇదేమిట్రా భగవాన్" కథ మళ్ళా అడ్డం తిరిగిందనుకున్నాడు. చీర తీసుకెళ్ళి తిరిగీ వాపసు చేద్దా మనుకున్నాడు. లాలనగా శ్రీమతిని..... "డియర్ నువ్వు నా రాణివి కదూ...ఇందా! చీర తీసుకో...కోపగించకు..." అని ప్రతిమాలుతున్నట్లు అడిగాడు. శ్రీమతి ప్రసన్నురాలైంది. "సరే" నని నవ్వుకుంటూ చీర తీసుకుని గదిలోని కెళ్ళిపోయింది. మిస్టర్‌గారు బడలిగ్గా వుంటే మంచంపై కెళ్ళి నడుం వాల్చాడు. పావు గంటలో మేరీవర ఫలహారం సిద్ధంచేసి ప్లేటులో వుంచుకుని హాల్లోకి వస్తే...లేడు. గదిలోకెళ్ళి చూడగా పడుకుని వున్నాడు. దగ్గరకుచేరి..."ఏమండీ! లేవండీ ఫలహారం తిందురుగాని" అంటూ కదలించింది. "ఉ...ఏమిటండి...నిద్రపోతుండడం తెలీయలా" అని అన్నాడు. "ఆ! తెలుస్తూనే వుంది దొంగ నిద్ర—లేవండీ ప్రొద్దుపోతూంది" అని లాలనగా అంది.

జాన్ డేవిడ్ వెంటనే పైకి లేచినాడు కొట్టేవానిలా పోజుపెట్టి. "ఇదిగో అమ్మాయ్! నన్ను అట్టే విసిగించకు...నన్ను నిద్రలేపకు" అన్నాడు అధికార స్వరంతో.

వర నవ్వుతూ "అట్లాగంటూనే పైకి లేచారే... తినండీ...వెళ్ళి రేపు రాత్రికి డిన్నర్‌కి రమ్మని ఫ్రెండ్సు నూ ఆహ్వానిద్దురు గాని" అని అంది.

కోపం వ్యక్తపరుస్తూ "నే నొక ఫూల్‌ని" అంటూ పడుకోబోయాడు. మీ యిష్టం ప్రకారమే చెయ్యండి.. నా మీద పూరకనే అలగకండి...నన్నెందుకండీ బాధపెట్టారు...నేనేం తప్పు చేశానని" అంటూ ఏడుపు మొదలుపెట్టింది. మిస్టరుకు చికాకెత్తింది. పైకి లేచి "ఏడవకు దేవీ ఏడవకు—తల పగిలిపోతూంది" అన్నాడు.

ఏడుపు ఆపి "అయితే ఫలహారం తినండి" అంటూ ఒక్కటి తీసి అతని నోట్లో పెట్టబోయింది... తిం టాగా ఖర్మ!" అని అంటూ అతను నోరు తెరిచాడు. "అయితే రేపు మీరు నాతో చర్చికి రారూ" అడిగింది. "ఎలాగ రానూ నా కేమైన క్రొత్త బట్టలున్నాయా" అని బదులిచ్చాడు. "ఏం తీసుకోలేకపోయారా" అని అంటూ లేచివెళ్ళి కాస్సేపట్లో ఒక పార్సిలు పట్టుకొచ్చింది.. "ఇదేంటో చెప్పుకోండి" అని అంది. "ఏంటో 'పజిల్' నాకేం తెలుసు—" అని ముఖం అటువైపు త్రిప్పుకొన్నాడు. మేరీవర పార్సిలు విప్పింది. అందులోనుంచి ఓ ట్వీడు పాంటూ, ఓ షార్క్‌స్కిన్ బుష్ షర్టూ తీసి భర్త ముందు నవ్వుతూ పెట్టింది. శ్రీవారు తిరిగి చూచి ఆశ్చర్యపోయి "ఎక్కడివి" అన్నాడు చేతిలోకి తీసుకుంటూ సంతోషంతో.

"అదంతా మీ శ్రీమతి ఇన్నాళ్ళూ కూడబెట్టిన మూల ధనమండీ శ్రీవారూ' అని నవ్వుతో అంది. "అయితే నన్ను ఎందుకు వేధించావు బట్టలకని" అడిగాడు. గల గలమని సెలయేరులా నవ్వుతూ" క్రిస్మస్ కదా...మీరు నాకూ...నేను మీకూ ప్రెజంటు చేసుకోవాలని వచ్చిన పన్నాగమండీ అబ్బాయిగారూ" అని అంది. డేవిడ్ సంతోషభరితుడై ఉప్పొంగి పోయాడు.

శ్రీశ్రీ

ఒక యిల్లాలు పాలవానితో యిలా అంది:

"ఏమయ్యా పా లేమీ బాగుండటం లేదు?"

"పచ్చిగడ్డి లేదమ్మా. ఈ కాలం పచ్చిగడ్డే దొరకదు. నా పశువులు అస్తమానూ అడుస్తూ వుంటాయి. ఎక్కువ పాలివ్వలేక పోతున్నామని అవి విచారంతో కన్నీరు కారుస్తూ వుండటం నే నెన్నోసార్లు చూశానమ్మా. ఇంతకూ మీరు నా మాట నమ్మ తారా యేమిటి?" అన్నాడు పాలవాడు.

"ఓ. నిన్ను నమ్ముతున్నా నయ్యా. కానీ యికముందు నీ పశువులు కార్చే కన్నీరు మాత్రం నా గిన్నెలో పడనివ్వకు" అంది యిల్లాలు.

